# చేతబడి

చేతబడి చేతబడి చేతబడి!

పత్రికల నిండా ఇవే వార్తలు!

ఓ కుగ్రామంలో ఓ అమ్మాయి చేతబడి ప్రభావం వల్ల పరికిణీ చింపేసుకుందిట! ఇంకెవరో పిచ్చెత్తిపోయారట!

నేను బడిపంతుల్ని. నాకు బడి రాబడి తప్ప చేతబడి తెలియదు.

అయితే ఆ కుగ్రామం పేరు చదవగానే, నేను గాబరా పడ్డమాట నిజమే! మా శ్రీమతి ప్రస్తుతం అక్కడే వుంటోంది. ఐదో నెలలో గాజులు పెట్టించడానికి వాళ్లవాళ్ల తీసుకెళ్లారు.

వారాంతాన్ని మోటారు సైకిల్ మీద ఆ కుగ్రామం వెళ్లేను. నేను వెళ్లేసరికి బాగా చీకటి పడిపోయింది. వీధి దీపాలు, రామరామ! మిణుగురు పురుగులే నయం!

ఆ రాత్రి అత్తారింట్లో ఆతిథ్యం పుచ్చుకుని నేనూ మా ఆవిడ 'ఏకాంతసేవ'లో గడిపి 'పవళింపు సేవ'లోకి జారుకున్నాం.

తెల్లవారే సరికి సంచలన వార్త!

"గత రాత్రి ఊళ్లోకెవరూ పరాయివాళ్ల రాకుండా ఊరి మొదట్లో కర్రలు పట్టుకుని కావలా కాసిన ఎర్రయ్యనీ పెంటయ్యనీ ఎవరో రోడ్డు పక్కకు తోసేశారని, వాళ్ల స్పృహ కోల్పోయారని, ఇది చేతబడి ప్రభావమే"నని.

"ఊళ్లోకి కొత్తగా ఎవరొచ్చారో వెతకండి" అన్నారు పంచాయితీ పెద్దలు.

మా అత్తారింటి బందుల దొడ్లో నా మోటారు సైకిలుంది.

"ఊర్లోకి ఒవురోయ్ వచ్చినారు?" అని పదిమంది మా అత్తారింటికి దండయాత్రకొచ్చారు.

నేనూ, మా మావయ్య బయటి కొచ్చాము.

"మన పెసిడెంటుగారి అల్లుడేహేస్! ఒవురో అనుకున్నాం. పోదం పదండేహేస్!" అనుకుంటూ వెళ్లిపోయారు.

అసలు సంగతి ఏమిటంటే-

నేను మోటార్ సైకిల్ మీద ఆ కుగ్రామం వెళుతూంటే-

ఎర్రయ్య, పెంటయ్య అనేవాళ్లు పూటుగా తాగేసి, తోవకి అడ్డంగా బిఛాణా వేసేశారు. నా మోటారు సైకిలు వెళ్లడానికి తోవకి అడ్డం అనీ, నేనే వాళ్లని రోడ్డుపక్కకు నెట్టేసి, ఆ గ్రామంలోకి ప్రవేశించాను.

24-4-1997 ఆంధ్రభూమి సచిత్రవార పత్రిక